# ఈడబ్ల్యు ఎస్ లో వర్గీకరణ తేవాలి

- వైశ్య కమిషన్ ను ఏర్పాటు చేయాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలి
- ఆగస్టు 3 న జరిగే వైశ్య రాజకీయ రణభేరిని విజయవంతం చేయాలి
- వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ డా. కాచం సత్యనారాయణ గుప్త



**విశ్వంభర, హైదరాబాద్ :** ఈ డబ్ల్యూ ఎస్ లో వర్గీకరణ చేసి వైశ్యక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలని, ఆగస్టు 3 న జరిగే వైశ్య రాజకీయ రణభేరిని విజయవంతం చేద్దాం అని వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. శుక్రవారం బషీర్ బాగ్ లో నీ ప్రెస్ క్లబ్ లో వైశ్యుల ఆత్మగౌరవం హక్కుల సాధనకై ఆగస్టు 3న నిర్వహించే" వైశ్య రాజకీయ రణభేరి" పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ కొత్త సంఘాలు పుట్టుకొస్తూ సంఖ్యాపరంగా పెరుగుతున్న వైశ్య హక్కుల విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా ఉందన్నారు. జనాభాలో దాదాపు నాలుగు నుండి ఐదు శాతం వరకు వైశ్య జాతి ఉంటుందని, జనాభా నిష్పత్తి ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు తర్వాత ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు తప్ప పెద్దగా అవకాశాలు కల్పించలేదని, ఇలానే ఈ పద్ధతి కొనసాగితే వైశ్యులు రాజకీయంగా కనుమరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. గ్రామాలలో ఇప్పటికీ వైశ్యులకు గ్రామ ప్రజల తో అందరికీ మంచి సంబంధాలు ఉంటాయని, కలుపుకుపోయే గుణం కూడా ఉంటుందని వైశ్యులకు టికెట్లు ఇస్తే గెలిచి చూపిస్తారని అన్నారు. 2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండు శాతం కూడా సర్పంచి స్థానాలలో వైశ్యులకు అవకాశాలు దక్కలేదని అన్నారు. గత కెసిఆర్ హయాంలో దాదాపు 6 కార్పొరేషన్ చైర్మన్లు, 11 మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్లు, జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు ఇవ్వడం జరిగిందని గుర్తుకు చేశారు. వైశ్య వికాస వేదిక ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు చేయడంతో పాటు, పదవ తరగతి ,ఇంటర్మీడియట్ ఫలితాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను ప్రతిభా పురస్కారాలు అందజేసి వారిని గౌరవించుకున్నామన్నారు. కోవిడ్ సమయంలో కూడా వైశ్య వికాస వేదిక ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేసి తన వంతు పాత్ర పోషించింది అన్నారు. వైశ్య రాజకీయ రణభేరిని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

డిమాండ్స్..

కుల గణన నివేదికలోని అగ్రవర్ణాల వివరాలు కులాల వారిగా ప్రకటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే నామినేటెడ్ పదవుల్లో వైశ్యులకు తగిన ప్రాధాన్యం కల్పించాలి. స్కిల్ యూనివర్సిటీలో వైశ్యులకు 25 శాతం సీట్లు కేటాయించాలి. విదేశీ విద్యా సహాయ నిధిని ఏర్పాటు చేసి వైశ్య విద్యార్థులకు తోడ్పాటు అందించాలి. వైశ్య బందును ప్రారంభించాలి. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బుక్క ఈశ్వరయ్య, కోడుమూరి దయాకర్, రామ్ నరేష్, కొత్త రవి,అనంత రాములు గుప్తా, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రమేష్, పశుపతి గుప్తా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రైల్ రోకోకు లాయర్ల మద్దతు

**పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహిస్తున్న రైల్ రోకోకు న్యాయవాదులు తమ మద్దతు తెలిపారు. తెలంగాణ జాగృతి లీగల్ సెల్ కన్వీనర్ నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను శుక్రవారం తన నివాసంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు.

యశోద ఆస్పత్రికి కవిత.. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత, తన తండ్రి కేసీఆర్ అనారోగ్యంతో యశోద ఆస్పత్రిలో చేరడంతో కవిత ఉదయం అక్కడికి వెళ్లారు. జ్వరం, మధుమేహ సంబంధిత సమస్యలతో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న తన తండ్రి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. అదేవిధంగా తెలంగాణ జాగృతి నాయకుడు డేవిడ్ కుటుంబ సభ్యులను రాంనగర్‌లోని వారి నివాసానికి వెళ్లి ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. డేవిడ్ తల్లి ఏసుమని ఇటీవల మృతి చెందారు. ఏసుమని చిత్రపటం వద్ద ఎమ్మెల్సీ కవిత నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## ఇచ్చిన వాగ్దానాలను ప్రశ్నించకూడదా..

**మాజీ మంత్రి కేటీఆర్ హాట్ కామెంట్స్**



**విశ్వంభర, హైదరాబాద్ :** ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో నిరుద్యోగ జేఏసీ 'చలో సెక్రటేరియట్' పిలుపునిచ్చింది. దీంతో పోలీసులు ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని విద్యార్థులతో పార్టీ విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కేటీఆర్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'X' (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేశారు. గౌరవనీయులైన మల్లికార్జున్ ఖర్గే .. మీరు హైదరాబాద్‌లో 'సంవిధాన్'ను సంబరంగా జరుపుకుంటున్నారు. ఇదే సమయంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో ప్రభుత్వం విద్యార్థులను అక్రమంగా అరెస్ట్ చేయించిందని వీడియోలను ట్యాగ్ చేశారు.ఈ చర్య కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క ప్రజాస్వామ్య హక్కుల పట్ల నిర్లక్ష్యానికి స్పష్టమైన రుజువు అని ఎద్దేవా చేశారు. పోలీసులు క్యాంపస్‌లో ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు? విద్యార్థులను లాక్కెళ్లడానికి వారికి అధికారం ఎవరిచ్చారని మండిపడ్డారు. నిరసన వ్యక్తం చేసే ప్రాథమిక హక్కును 'సంవిధాన్' నుంచి తొలగించారా..? అని సెటైర్లు వేశారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణ ఉద్యమానికి గుండెకాయ లాంటిందని అన్నారు. ఒకవేళ విశ్వవిద్యాలయంలో నిరసనలు జరగకపోతే.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఉండేది కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని.. ఇచ్చిన వాగ్దానాలను ప్రశ్నించకూడదా రాహుల్ గాంధీగారు.. అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

**జాబ్ నోటిఫికెషన్స్ వేయాలని చేపట్టిన**

## సెక్రటేరియట్ ముట్టడి

**రాష్ట్ర వ్యాప్తంగా ముందస్తు అరెస్టులు చేయించిన ప్రభుత్వం**



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అరెస్టుల మీద పెట్టిన శ్రద్ధను జాబ్ నోటిఫికేషన్స్ వేయడం పై శ్రద్ధను పెట్టాలని, ప్రజా పాలన పేరుతో అడుగడుగునా అక్రమ అరెస్టులు చేయడం దారుణమని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని,నిరుద్యోగ యువతకు ఎన్నికల హామీల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ను అమలు చేసి ఉద్యోగాలకై నోటిఫికెషన్స్ వేయాలని, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగులు,డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ సచివాలయాన్ని ముట్టడించడం జరిగింది.సెక్రటేరియట్ ముట్టడికి వెళ్తున్న డివైఎఫ్ఐ నాయకులు అరెస్టు చేసి అఫ్జల్గంజ్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ రేపు రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దగ్ధం కార్యక్రమానికి పిలుపునిచ్చారు. సచివాలయం ముట్టడి సందర్భంగా అరెస్టు అయినవారిలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జావీద్,ఏ కృష్ణా నాయక్, జిల్లా నాయకులు రాజయ్య, కృష్ణ,శ్రీను నాయక్,రాజేష్, వినోద్, నిరుద్యోగులు నవీన్, సందీప్,రాజేందర్, రామ్, రాకేష్ తదితరులు ఉన్నారు.

**మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు**

## 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలి

**టిపియుఎస్ జిల్లా అధ్యక్షులు పర్వతం సంధ్యా రాణి**

**విశ్వంభర, కోదాడ :** మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీమతి పర్వతం సంధ్యారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం తపస్ సభ్యత్వ అభియాన్ లో భాగంగా మునగాల నడిగూడెం మండలాల్లో జెడ్ పి హెచ్ ఎస్ ,మోడల్ స్కూల్స్ , కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ స్కూల్స్ లో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని అంతేకాకుండా వారి సమ్మె కాలపు వేతనాన్ని కూడా చెల్లించాలని,వారికి మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని ,ఉద్యోగ ఉపాధ్యాయులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న డి ఎ, పి ఆర్ సి, లను కూడా వర్తింపజేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సభ్యత్వ అభియాన్ లో జిల్లా ఉపాధ్యక్షులు సుందరి శ్రీనివాస్,మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సంఘం టి ఏ పి యు ఎస్ రాష్ట్ర కన్వీనర్ జమలాపురం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చలో ఎల్బీ స్టేడియం కార్యక్రమానికి కదం తొక్కిన కాంగ్రెస్ నాయకులు



**విశ్వంభర, మహేశ్వరం :** మహేశ్వరం మండల కేంద్రంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్ ఆదేశాల మేరకు మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య తో పాటు నియోజకవర్గం సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర చంద్రమోహన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆవుల రమేష్, లోకేష్ రెడ్డి,రాష్ట్ర రాజధాని హైదరాబాద్లోని ఎల్బీ స్టేడియంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే రాక సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య విభాగాలు, అదేవిధంగా ముఖ్య కార్యకర్తలు మల్లికార్జున ఖర్గే సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సిహెచ్ యాదయ్య నేతృత్వంలో ప్రదర్శనగా బయలుదేరడం విశేషం. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య మాట్లాడుతూ. దేశంలో రాజ్యాంగాన్ని రూపుమాపే విధంగా భారతీయ జనతా పార్టీ కుట్రలు పన్నుతోందని ఇందులో భాగంగానే జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించడం జరిగిందని రాజన్న పై జరుగుతున్న కుట్రను ముక్తకంఠంతో నిలదీసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సారాధ్యంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభకు పెద్ద ఎత్తున తరలి వెళ్లడం జరుగుతుందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను తొలగిస్తారని, రాజ్యాంగాన్ని మార్చుతారని మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య ఆరోపించారు. రిజర్వేషన్లతో పాటు రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలంటే కేంద్రంలో బీజేపీని గద్దె దించి కాంగ్రెస్ పార్టీని దేశవ్యాప్తంగా ప్రజలు బలపరచాలని అన్నారు. బీజేపీ పాలనలో దళిత, గిరిజన మైనార్టీలతో పాటు మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, వారిపై దాడులు నిత్యం జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ మెజారిటీ ప్రజలకు రక్షణతో పాటు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే కాంగ్రెస్ పార్టీని బలపరిచి దేశ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలో జై బాపు జై భీమ్ జై సమిధన్ కార్యక్రమాలతో ప్రజలను చైతన్యపరచడం జరిగిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ భారీ సమీకరణతో ముందుకు రావడం పట్ల ఆయా మండలాల అధ్యక్షులను, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులను, వివిధ విభాగాల నాయకులకు కార్యకర్తలకు ఎలెక్ట్రానిక్ ప్రింట్ మీడియా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వైశ్య రాజకీయ రణభేరి గోడపత్రికను ఆవిష్కరించిన వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్, వీ3 న్యూస్, ప్రజా విశ్వంభర చైర్మన్ డా. కాచం సత్యనారాయణ గుప్త, రిటైర్డ్ ఎస్పీ విజయ్‌కుమార్ పోలె, బీఆర్ఎస్ నాయకుడు నాళ్ల శ్రీనివాస్ గుప్త, శ్రీకాంత్ గుప్త, పశుపతి, పురుషోత్తం, బుక్క ఈశ్వరయ్య, శ్రీధర్, వేణుగోపాల్, వంగవీటి శ్రీనివాస్ తదితరులు.

- విశ్వంభర, హైదరాబాద్



## రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన రేవంత్, ఖర్గే

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలోని లక్డీకాపూల్‌లో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. రోశయ్య జయంతి సందర్భంగా నేతలు నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బిపిఎస్ పిల్లలపై వివక్ష తగదు అందరిలాగే బుక్స్ ఇవ్వాలి

- ఒకే గదిలో కూర్చోబెట్టాలి
- నల్లగొండలో ఆల్ఫా స్కూల్ ఎదుట ధర్నా



**నల్లగొండ, విశ్వంభర :** బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థులకు ఆల్ఫా స్కూల్ యాజమాన్యం వివక్షతకు పాల్పడుతుందని సరైన బుక్స్ ఇవ్వకుండా దళిత విద్యార్థులను ఒంటరిగా కూర్చోబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున తెలిపారు.శుక్రవారం విద్యార్థుల పేరెంట్స్ తో కలిపి ఆల్ఫా పబ్లిక్ స్కూల్ ముందు ధర్నా నిర్వహించారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లలో దళిత విద్యార్థులకు ఉన్నత విద్య చదివించాలనే లక్ష్యం బూడిదలో పోసిన పన్నీరు లాగా మారుతుందన్నారు.నల్గొండ జిల్లా కేంద్రంలో ఉన్న ఆల్ఫా పబ్లిక్ స్కూల్లో దళిత విద్యార్థులకు బుక్స్ ఇవ్వకుండా అందరినీ ఒకే క్లాసులో కాకుండా దళిత విద్యార్థులను సపరేట్గా కూర్చోబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు సరిగా వసతులు కల్పించకుండా నెల రోజులుగా తల్లిదండ్రులు ఎంతో మనోవేదనకు గురై విద్యార్థులు తల్లి దండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆల్ఫా స్కూల్ ముందు ధర్నాకు దిగడం జరిగిందని పేర్కొన్నారు.ఆల్ఫా స్కూలు యజమాన్యం మొండిగా వ్యవహరిస్తూ మీ ఇష్టం ఉంటే ఉండండి లేదంటే వెళ్లిపోండి అని దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ సోషల్ వెల్ఫేర్ డిడి కలగజేసుకొని సమగ్రంగా విచారణ జరిపి ఆల్ఫా స్కూల్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి గాదె నరసింహ, మండల కార్యదర్శి బొల్లు రవీంద్ర కుమార్, పేరెంట్స్ బండారు శంకర్, కత్తుల శివ, టి రవితేజ రాజు,పేర్ల నరసింహ, కట్టా నవీన్, జి శ్రవణ్, నాగరాజు, ఎం రజిత, మేడిపల్లి పల్లవి, అరుణ, మేడిపల్లి లక్ష్మీ, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యం తో రైతు మృతి

**కొత్తపేట ఓజోన్ హాస్పిటల్ లో ఘటన**

**మృతదేహానికి వైద్యం చేశారని కుటుంబ సభ్యులు, బంధువుల ఆరోపణ**



**విశ్వంభర, ఎల్బీనగర్:** వైద్యుల నిర్లక్ష్యంతో ఒక రైతు మృతి చెందిన ఘటన కొత్తపేట లోని ఓజోన్ హాస్పిటల్ లో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. చనిపోయిన వ్యక్తికి వైద్యం చేశారని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే... సూర్యాపేట జిల్లా పెనుపహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన బైరెడ్డి భగవంత్ రెడ్డి (60), భార్య దుర్గమ్మ (50). వృత్తిరీత్యా స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 30వ తేదీన ఒంట్లో నలతగా ఉందని ఎన్టీఆర్ నగర్ లోని ఓజోన్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. భగవంత్ రెడ్డికి పూర్తిగా వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని సూచించారు. రూ. 8 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని ఈనెల 2వ తేదీన ఉదయం సుమారు 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, రాత్రి 8 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు రెండు దఫాలుగా ఆపరేషన్లు నిర్వహించినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. దాదాపు 20 యూనిట్ల రక్తాన్ని ఎక్కించి, రెండు రోజులుగా ఎవరిని కూడా ప్రత్యేక చికిత్స విభాగానికి పోకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో బాధిత రైతు కుటుంబ సభ్యుల ఐసీయూలోకి వెళ్లి చూడగా అప్పటికే భగవంత్ రెడ్డి చనిపోయినట్లు నిర్ధారించుకున్నారు. రెండు రోజుల క్రితం చనిపోయిన మృతదేహానికి రక్తం ఎక్కించి తమను మోసం చేశారని మృతుడి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన నిర్వహిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న చైతన్యపురి పోలీసులు విచారణ చేస్తున్నారు.